# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## ఇప్పుడే ఎందుకు మారింది?

బుడి బుడి అడుగుల వయసులోనే మారథాన్ గెలిచారన్న వార్త ఎప్పుడైనా విన్నామా? కానీ తెలంగాణ విషయంలో మాత్రం ఇది నూటికి నూరు పాళ్లు అక్షర సత్యం. కేవలం తొమ్మిదేండ్లలోనే తెలంగాణ సాధించిన ఘనతలు అమోఘం, సాధించిన కీర్తి అనిర్వచనీయం. కారణం ఉద్యమ నాయకుడైన పరిపాలకుడికి రాష్ట్రాభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధి, లక్ష్య సాధనకు అవసరమైన సమగ్ర ప్రణాళిక. గత పాలకుల్లో లోపించింది ఇదే.

తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రపంచం వేనోళ్లా పొగడుతున్నది. పెట్టుబడుల స్వర్గధామంగా తెలంగాణను కీర్తిస్తున్నారు. భౌగోళిక అనుకూలతలకు తోడు అత్యద్భుతమైన మౌలిక వసతులు కల్పిస్తున్నది కేసీఆర్ ప్రభుత్వం. పారిశ్రామిక రంగం పరుగులు పెడుతున్నది. పల్లెలు, పట్టణాలు బాగుపడ్డాయి. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరంతో విశ్వ ఖ్యాతి సాధించాం. వలసలతో విలవిలాడిన పాలమూరు నేడు కృష్ణమ్మ పరవళ్లతో పులకించిపోతున్నది. సంక్షేమంలో తెలంగాణను మించిన మనసున్న సర్కారు ఈ భూ ప్రపంచంలోనే ఎక్కడా లేదు! ప్రతీ రంగంలో తెలంగాణ సర్కారు పథకాలు ఓ మైలురాయిలా దేశానికి ఓ దిక్సూచిలా నిలుస్తున్నాయి. ఇదంతా కేవలం 9 ఏండ్లలో సాధించిన ఘనత మాత్రమే.



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లవుతున్నా.. ఏనాడూ తెలంగాణలో ఇంతటి వృద్ధి, ఆర్థిక సమృద్ధి కనిపించలేదు. తెలంగాణలో చెరువులు, రిజర్వాయర్లు, డ్యామ్‌లు పడావుబడ్డ దుస్థితిని మనం కళ్లారా చూశాం. ఉరికొయ్యకు వేలాడిన అన్నదాతల కన్నీటి గాథలను చూశాం. బతుకు నడవక.. తాను నేసిన దారాలను తాడుగా పేని ఉరి తాడుగా మార్చుకున్న నేతన్నల గోసను చూశాం. అలాగని ఈ ప్రాంతానికి పాలకులు లేరా, బడ్జెట్ కేటాయింపులు లేవా అంటే.. అన్నీ ఉన్నాయి. అయినా 2014కు ముందు వరకు అవే కష్టాలు. కానీ 2014 తర్వాత అకస్మాత్తుగా పరిస్థితులు మారిపోయాయి. బీడుబారిన చెరువులు, రిజర్వాయర్లు, డ్యాములు జలకళతో తొణికిసలాడటం మొదలుపెట్టాయి. బీడువారిన నేలల్లో బంగారం పండుతున్నది. ఈ ప్రాంతాన్ని గతంలో, ప్రస్తుతం పరిశీలించిన మేధావులు, సెలబ్రిటీలు, పెట్టుబడిదారులు చెప్తున్న మాట ఇది.

మరి ఇదంతా ఎలా సాధ్యమైంది? తెలంగాణ అంటే ఇప్పుడో బ్రాండ్‌గా ఎందుకు మారింది? గతంలో ఈ ప్రాంతాన్ని చాలా పార్టీలు దశాబ్దాల పాటు పాలించాయి. ఇప్పుడు ఉన్నట్టుగానే అప్పుడూ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఉద్యోగులు అప్పటివాళ్లే.. రాజకీయ నాయకులు అప్పటివాళ్లే. అప్పుడూ ఇప్పుడూ ఒకే రకమైన పాలనా వ్యవస్థ ఉంది. మరి ఈనాడు ఈ అభివృద్ధి ఎలా సాధ్యపడింది? అనే ప్రశ్న చాలాసార్లు నా మదిని తొలిచింది. బాగా ఆలోచిస్తే తట్టిన విషయం ఏంటంటే.. కేవలం మారిందల్లా పాలించే నాయకుడు. త్రికరణ శుద్ధితో పనిచేసే ఓ కార్యసాధకుడు ఇప్పుడు మన ముందుకు వచ్చారు. రాష్ర్టాన్ని బాగు చేసుకోవాలనే తపన, ప్రజల జీవితాలు మార్చాలనే సంకల్పం, నా ప్రాంతం గురించి విశ్వమంతా చర్చించుకునే స్థాయికి ఎదగాలనే ఆకాంక్షతో చిత్తశుద్ధితో ప్రభుత్వ వ్యవస్థను కేసీఆర్ సరైన దారిలో నడిపించారు.

కేసీఆర్ ఏ మంత్రం వేయలేదు.. ఏ మాయాజాలం చేయలేదు. కానీ రాష్ట్రాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకున్నారు. రాష్ట్రం ఏర్పడితే ఏం చేయాలనే దానిపై 2014కు ముందే అనేకమంది మేధావులతో చర్చించి.. ఓ స్పష్టమైన అవగాహనకు వచ్చారు. చేయాల్సిన పనులపై బ్లూ ప్రింట్ తయారు చేసి పెట్టుకున్నారు. రాష్ట్రం గురించి స్పష్టమైన అవగాహన సాధించారు. ఎక్కడ ఏ సమస్య ఉంది? ఎక్కడ లోపం ఉంది? దేన్ని సరిచేస్తే రాష్ట్రం బాగుపడుతుంది? ఇలా ప్రతీ అంశంపై సూక్ష్మస్థాయిలో అవగాహనతో రాష్ట్ర శ్రేయస్సు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తొమ్మిదిన్నరేండ్లుగా అహర్నిశలు పనిచేస్తూనే ఉన్నారు. మన లక్ష్యంలో, ఆలోచనలో చిత్తశుద్ధి ఉంటే.. ఆ దేవుడు కూడా మన వెంటే ఉంటాడని అన్ని మత గ్రంథాలు చెప్తున్నాయి. కేసీఆర్ ఆలోచనంతా రాష్ట్ర ప్రజల బాగోగుల గురించే కాబట్టి దేవుడు కూడా ఆయన వెంటే ఉన్నారు. ఫలితంగా నేడు తెలంగాణ పచ్చబడింది. పల్లే కన్నీరు పెడుతుందో, నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకి అనే పాటలు పోయి.. పల్లె మురుస్తున్నదనే పాటలు వినిపిస్తున్నాయి. అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు పెడుతున్నది. పొరుగు రాష్ర్టాలకు రోల్ మాడల్ అయ్యింది. ప్రపంచ దేశాల పెట్టుబడులకు కేరాఫ్ అయ్యింది.కానీ ఆనాడు దశాబ్దాల పాటు పాలించిన పార్టీలకు, ఆ పార్టీల నాయకులకు గానీ ఈ చిత్తశుద్ధి లేదు.

ప్రియములేని విందు పిండివంటల చేటు
భక్తిలేని పూజ పత్రి చేటు
పాత్ర మెఱుగనీవి బంగారు చేటురా
విశ్వదాభిరామ! వినుర వేమ!

ఈ పద్యంలో చెప్పినట్టుగా ఈ ప్రాంతంపై ఆనాటి పాలకులకు ప్రేమ లేదు. ఈ ప్రాంతాన్ని బాగు చేయాలనే శ్రద్ధ లేదు. మొత్తంగా ప్రజలకు మంచి చేయాలనే చిత్తశుద్ధి లేదు. ఎంతసేపూ తమ బొక్కసాలు నింపుకోవడం తప్పితే.. బుక్కెడు బువ్వ దొరక్క అల్లాడుతున్న బిడ్డలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ పరిస్థితులను కేసీఆర్ స్వయంగా చూశారు. అనుభవించారు. అందుకే నడుం బిగించి ఉద్యమాన్ని నడిపించారు. నేడు నాయకుడై రాష్ర్టాన్ని ప్రగతి పథంలోనూ పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్రం సిద్ధించగానే సంబరపడిపోలేదు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో కేసీఆర్ తరుచూ ఓ మాట చెప్తూ ఉండేవారు. 'రాష్ట్ర ఏర్పాటుతోనే అంతా అయిపోలేదు. లక్ష్య సాధనలో ఒక మెట్టు మాత్రమే ఎక్కాం. మనం చేయాల్సిన పని ఇప్పుడే మొదలవుతున్నది. తెలంగాణ అభివృద్ధే మన ముందున్న అసలు సవాల్' అని. ఒక పోటీలో గెలవాలంటే.. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని పనిచేయాలి. అప్పుడే అందులో విజయం సాధిస్తాం. కేసీఆర్ అదే పని చేశారు. పల్లేర్లు మొలిచిన నేలను బంగారుమయం చేశారు. ఆయనే ఒక్కరే కాదు.. యావత్ రాష్ట్రం ఆనందంగా ఉండేలా చేశారు. అత్యున్నత శిఖరాలను చేరుకోవడమే లక్ష్యంగా నేడు రాష్ర్టాన్ని అడుగులు వేయిస్తున్నారు. పొగడ్తలకు పొంగిపోయి, సాధించిన దానికి సంతృప్తి చెంది ఊరుకునే వ్యక్తి కాదు కేసీఆర్. ఆయన నిత్య కృషీవలుడు. మనం చేసే పనిలో మంచి కనిపించాలి కానీ మనం కనిపించకూడదు అని కోరుకునే వ్యక్తి ఆయన. అందుకే నేడు రాష్ట్రం ఇంత సుభిక్షంగా ఉన్నది.



వై.సతీష్ రెడ్డి
96414 66666
(వ్యాసకర్త: చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ)



## కల నెరవేరింది

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన సమయం రానే వచ్చింది. మంగళవారం నుంచి సిద్దిపేటలో రైలు కూత వినిపించింది. ఆరు దశాబ్దాల సిద్దిపేట కల స్వరాష్ట్రంలో నెరవేరింది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నిరంతర పర్యవేక్షణ, పట్టుదలతో సిద్దిపేట రైల్వే లైన్ సాకారమైంది.

గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రైల్వే లైన్ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేయలేకపోయారు. దీని వల్ల దశాబ్దాలుగా సిద్దిపేటకు రైల్వే సేవలు అడియాసగా ఉండేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి కారణంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు కొత్త రైల్వే లైన్ మంగళవారం ప్రారంభమైంది. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు పుష్‌పుల్ రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్గంలో రెండు రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ పచ్చ జెండా ఊపింది. తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్నను ప్రతి సంవత్సరం 25 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. అయితే ఈ పుణ్యక్షేత్రానికి సరైన ప్రయాణ సౌకర్యాలు లేక భక్తులు తిప్పలు పడుతున్నారు. రాజీవ్ రహదారి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి చేరుకోవడానికి, తిరిగి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గంటలకొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పుడు సిద్దిపేటకు రైలు సర్వీసులు అందుబాటులోకి రావడం వల్ల భక్తులకు సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయి. ఈ ప్రాంతానికి రైలు మార్గం వేయడం వల్ల ఎరువుల సరఫరా రైళ్ల ద్వారానే జరుగుతుంది. ధాన్యం ఎగుమతులకు ఊపు లభిస్తుంది. సిద్దిపేటలో కూడా రైల్వే ద్వారా సరుకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తే ధాన్యం తరలించేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ■



ఆలేటి రమేశ్
99487 98982



## అభివృద్ధి యజ్ఞం ఆగొద్దు

నెర్రెలుబారిన నేలలు, ఎండిన చెరువులు, వర్షాధారపు పంటలు, ముంబయి, దుబాయి, మస్కట్ వలసలు, పాలమూరు కూలీల గోసలు, కరెంటు కోతలు, నేతన్నల ఆకలి చావులు, అన్నదాతల ఆత్మహత్యలు.. ఇది తొమ్మిదేండ్ల కిందట వరకు తెలంగాణ ముఖచిత్రం. కానీ దార్శనికుడు, రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా తెలంగాణ స్వరూపమే మారిపోయింది. ఎక్కడచూసినా పచ్చని పంట పొలాలు, నీళ్లతో నిండుగా చెరువులు, యువతకు ఉపాధి లభిస్తున్నది. 24 గంటల కరెంటు, చేనేతలకు చేయూత, రైతు బంధు, పరిశ్రమలకు పెట్టుబడుల వెల్లువతో తెలంగాణలో కొత్త శకం ప్రారంభమైంది.

ఉద్యమ సమయంలో కేసీఆర్ ఎలాంటి తెలంగాణ కోసమైతే కలలు గన్నారో.. అలాంటి బంగారు తెలంగాణ మన కళ్లెదుటే సాక్షాత్కారమైంది. తెలంగాణను అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా కేసీఆర్ నిలిపారు. సీమాంధ్రుల పాలనలో విధ్వంసమైన తెలంగాణను సీఎం కేసీఆర్ సోషల్ ఇంజనీర్ అవతారమెత్తి పునర్ నిర్మిస్తున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా నదీ జలాల్లో మన వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం, వ్యవసాయాన్ని పండుగలా చేయడం, కొత్త కలెక్టరేట్లు, కొత్త సెక్రటేరియట్, చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించడం చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు 'ఆసరా'గా నిలవడం, రైతులకు పంట పెట్టుబడి సాయం, రైతు ఏ కారణంతో చనిపోయినా రైతుబీమా ద్వారా ఆ కుటుంబానికి అండగా నిలవడం, కుల వృత్తులకు చేయూతనివ్వడం, దళితులను వ్యాపారాల్లో ప్రోత్సహించి వారిలో ఆత్మగౌరవం పెంపొందించడం, ఆడబిడ్డల పెండ్లి ఖర్చులకు సాయం, వందల సంఖ్యలో ఉన్న గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యను అందివ్వడం, 26 మెడికల్ కాలేజీలను ప్రారంభించి రాష్ట్ర విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం, నియోజకవర్గానికో 100 పడకల దవాఖానతో ప్రజలకు వైద్యం అందేలా చూడటం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇవ్వడం, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మన భాషే ప్రామాణికం అయ్యేలా చేయడం, అన్నింటికీ మించి రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం తెలంగాణ పునర్ నిర్మాణ లక్ష్యాల్లో భాగమే. ప్రజల కోసం సంక్షేమ పథకాలను అమలుచేస్తూనే.. మౌలిక వసతుల కల్పనపైనా సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులతోపాటు ఉమ్మడి ఏపీలో నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన చిన్నా, పెద్ద ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఫలితంగా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం రెండింతలైంది. ఇవాళ దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ నిలిచింది. అయితే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ర్టానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు.

హైదరాబాద్ మహా నగరానికి కొత్త పరిశ్రమలను తీసుకురావడంతోపాటు మెట్రో రైలు నిర్మాణం, విస్తరణ, ట్రాఫిక్ కంట్రోల్ కోసం భారీ ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ లాంటి మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేస్తున్న కృషి అజరామరం. ఐటీ ఎగుమతులు పెరగడానికి, ప్రజల తలసరి ఆదాయం ఏడాదికి రూ.3.5 లక్షలకు ఎగబాకడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే కారణం. తెలంగాణ ఆవిర్భావం నాటికి రూ.5.05 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2022-23 నాటికి రూ.13.27 లక్షల కోట్లకు పెరిగింది. వివిధ రిపోర్టుల ప్రకారం రాష్ట్ర జీఎస్‌డీపీ సగటు వార్షిక వృద్ధి రేటు 8.6 శాతంగా నమోదైంది.

ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ లాంటి రాష్ర్టాలు కొత్తగా ఏర్పడి 23 ఏండ్లు గడుస్తున్నా ఇంకా బాలారిష్టాలను దాటలేదు. కానీ రాష్ట్ర సాధన కోసం ముందుండి నడిచిన నాయకుడే ముఖ్యమంత్రి కావడం వల్ల తొమ్మిదేండ్లలో తెలంగాణ గణనీయమైన అభివృద్ధిని సాధించింది. అయినా కాంగ్రెస్, బీజేపీ నేతలు కాళేశ్వరం నీళ్ల విషయంలో, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో విషం చిమ్ముతున్నారు. కోటి ఎకరాల మాగాణిని తడుపుతున్న నీళ్లను చూడకుండా.. కరెంటు బిల్లుల పేరిట నానా యాగీ చేస్తున్నారు. రైతుబంధు, దళితబంధుపై దుష్ప్రచారం చేస్తున్నారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీ కుల వృత్తులకు చేయూత లాంటి అనేక పథకాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందాలన్నా, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి రావాలి. తెలంగాణకు కేసీఆరే నాయకత్వం వహించాలి. పదేండ్లుగా అప్రతిహతంగా సాగుతున్న అభివృద్ధి ఆగొద్దంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



సీహెచ్ దినేష్ కుమార్
98490 50305
(వ్యాసకర్త: రిటైర్డ్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం)

## ఎస్సీ ఉప కులాలకు న్యాయమెప్పుడు?

75 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో రిజర్వేషన్లు అమలవుతున్నా కూడా వాటి ఫలాలు నేటికీ అనేక కులాలకు అందటం లేదు. ముఖ్యంగా, ఎస్సీల్లో ఉప కులాలుగా ఉన్న ప్రజలు అభివృద్ధికి ఎంతో దూరంలో ఉన్నారు. ఎస్సీలకు అమలవుతున్న రిజర్వేషన్ల వల్ల మాల, మాదిగలే గరిష్ఠంగా లబ్ధి పొందుతున్నారు. ఉమ్మడి ఏపీలో నాలుగేండ్లపాటు అమలైన వర్గీకరణ కూడా ఉప కులాలకు న్యాయం చేయలేకపోయింది. ఈ నేపథ్యంలో ఎస్సీ ఉప కులాలను ఆదుకునే విధంగా ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాల్సిన అవసరం ఉన్నది.

ఎంతో ఆశావహ దృక్పథంతో, సామాజిక నిబద్ధతతో ఏర్పాటు చేసుకున్న రిజర్వేషన్లు, వాటి ఫలాలు కిందిస్థాయి వరకు చేరడంలేదు. ఎస్సీలలోని కొన్ని సంపన్న శ్రేణులు మొత్తం రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయి. ఇది సామాజిక అసమానతలకు దారితీస్తున్న విషయాన్ని అనేక నివేదికలు తెలియజేస్తున్నాయి. రిజర్వేషన్ల లక్ష్యం అసమానతలు తొలగించడమే అయినప్పుడు, కల్పించిన రిజర్వేషన్లతోనే అసమానతలు ఏర్పడటం ఆందోళనకరం. 1996 సెప్టెంబర్లో నాటి ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ అందరికీ సమన్యాయం కోసం ఎస్సీలను ఏ, బీ, సీ, డీ లుగా వర్గీకరించాలని సూచించింది. దాని ప్రకారం ఎ-గ్రూపులో రెల్లి తదితర 12 కులాలకు ఒక శాతం రిజర్వేషన్; బి-గ్రూపులో మాదిగ తదితర 18 కులాలకు 7 శాతం రిజర్వేషన్; సి-గ్రూపులో మాల తదితర 25 కులాలకు 6 శాతం రిజర్వేషన్; డి-గ్రూపులో ఆది ఆంధ్ర తదితర 4 కులాలకు ఒక శాతం రిజర్వేషన్.. మొత్తం 59 కులాలకు 15 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని చెప్పింది. ఈ మేరకు 2000 నుంచి 2004 వరకు ఏపీ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేసింది. 2004లో దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రద్దుచేస్తూ, వర్గీకరణచేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ 2008లో కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందజేసింది.

తెలంగాణలో మోచి, బైండ్ల, హోలీయ దాసరి, గోసంగి, చిందు, మాస్టిన్, మాదిగ జంగం, మాల జంగం, డక్కలి, సమగర, బేడ బుడగ జంగం, నేతకాని, మితల్ అయ్యవార్లు, మాదాసి కురువ, పాకి, బ్యాగరి, దొంబరా, మన్నె మొదలైన అత్యంత వెనుకబడిన 57 ఉప కులాలు ఉన్నాయి. వీరి జనాభా 21,44,718. ఎస్సీలలో వీరు 34 శాతం ఉన్నారు.

ఈ దేశ చరిత్రను, పురాణాలను భాగవతం, యక్షగానాల రూపంలో భవిష్యత్తు తరాలకు అందిస్తున్న ఉప కులాల ప్రజలు నేటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారు. భిక్షాటన చేస్తూ, పూసలు అమ్ముతూ, చెప్పులు కుడుతూ, సంచార జీవనం గడుపుతూ, వీధి సర్కస్‌లు చేస్తూ, గ్రామ దేవతలకు పూజారులుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయాల పరంగా మాల, మాదిగలతో పోల్చితే అత్యంత వెనుకబడి ఉన్నారు.

నేడు ఎస్సీ ఉప కులాల ఆత్మగౌరవ సభ



కులం, వృత్తి, దారిద్ర్యం ఇవన్నీ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. రిజర్వేషన్ల వల్ల సమన్యాయం జరగాలి. ఇదే అంశంపై 2020 ఆగస్టు నెలలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం వర్సెస్ దావీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును విస్తృత ధర్మాసనం పరిశీలనకు నివేదించారు. ఈ కేసులో కొన్ని ముఖ్యమైన అంశాలను గమనిస్తే ఎస్సీలను వర్గీకరించరాదంటూ 2004లో ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని, ఎస్సీలను వర్గీకరించి వారిలో వెనుకబడ్డ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ర్టాలకు ఉందని ధర్మాసనం తేల్చి చెప్పింది. 2004లో చెన్నయ్య కేసును విచారించిన బెంచ్ ఇచ్చిన తీర్పు సరికాదని, వాస్తవాలను గుర్తెరగకపోతే సామాజిక మార్పు జరగాలన్న రాజ్యాంగ లక్ష్యం నెరవేరదని స్పష్టం చేసింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 నుంచి 2004 వరకు అమలులో ఉన్న ఎస్సీ వర్గీకరణ వల్ల ఎస్సీల్లో ఉన్న మాల, మాదిగ కులాలు మాత్రమే అధిక లబ్ధి పొందాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఎస్సీ ఉపకులాలకు తీరని నష్టం జరిగిందని వివిధ నివేదికలు తెలియజేస్తున్నాయి. కాబట్టి గతంలో జరిగిన ఎస్సీ వర్గీకరణను రద్దు చేసి, అందుకు భిన్నంగా ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరిగే విధంగా హేతుబద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేయాలి. ఎస్సీ ఉప కులాలను ఎ-గ్రూపులో; మాదిగలను బి-గ్రూపులో, మాలలను సి-గ్రూపులో ఉండేట్లు ఎస్సీల వర్గీకరణ చేయాలి. మూడు గ్రూపులకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ల శాతాన్ని కేటాయించాలి. మాలల ద్వారా మాదిగలకు నష్టం జరిగిందని అంటున్నారు. అది నిజమే కానీ.. మాల, మాదిగల ద్వారా ఎస్సీ ఉప కులాలకు కూడా తీవ్ర నష్టం జరుగుతూనే ఉంది. దీన్ని నివారించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఒకే జాతి వారమన్న నెపంతో సంపన్న శ్రేణి వారు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు పొందడం సరి కాదు. కాబట్టి రాజ్యాంగ రక్షకులైన సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం ఈ అసమానతలను తొలగించటానికి తగిన చర్యలు తీసుకొని అందరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఉన్నది. ఆ క్రమంలో ఎస్సీల్లో ఉన్న ఉప కులాలకు రిజర్వేషన్లలో అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.



బైరి వెంకటేశం మోచి
94919 94090
(వ్యాసకర్త: వ్యవస్థాపక అధ్యక్షులు, ఎస్సీ 57 ఉప కులాల హక్కుల పోరాట సమితి)



## జీవితమే కవిత్వం!

పద్యం మోస్తున్నంత సేపు
నాకు అలసట తెలియలే
యుద్ధం చేస్తున్నంత కాలం
నన్ను ఓటమి వెంటాడలే!

దుఃఖమెప్పుడు రూప వస్తువు కాదు
అపురూపమయింది
ధైర్యంగా నిలబడే వాడిని
నిఖార్సుగా నిగ్గు తేలుస్తుంది!

ప్రవహించే నదిని చూస్తే
ఎవరికైనా భయమే
తెగించి ఎదురీదితేనే
ప్రమాదాలను జయించేది!

సముద్రం ఎంత ఎగిసిపడినా
అది ఆకాశాన్ని అందుకోలేదు
అల్పులెందరు వేలెత్తి చూపినా
ధీశాలి కీర్తి కిరీటం నేల జారదు!

చరిత్రలో ఎవరినైనా చూడండి
నిజాయితే వెన్నెముక
పద్యమైనా సరే బజారుకెక్కందే
దాని బలం నిరూపితం కాదు!

రెండు పాదాల మీద
సాగుతున్న నీ జీవితం
ఎంత క్లుప్తమో అర్థమైతే
నీకు కవిత్వమబ్బినట్లే!!



కోట్ల వెంకటేశ్వరరెడ్డి
94402 33261